

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :7.816(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:7(4), July: 2021
Online Copy of Article Publication Available: www.ijmer.in
Digital certificate of publication: http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
*Article Received: 4th July*
*Publication Date:30th July 2021*

DOI: http://ijmer.in.doi./2021/10.07.70

# మహాభారతంలో బ్రహ్మచర్యాశ్రమము - కచదేవయాని కథ

**డా॥ సి.నర్సింహులు,**

**సహాయ ఆచార్యులు,**

**యం.వి.యస్. ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్సు కళాశాల,(స్వయం)**

**మహబూబునగరు - 509001.**

మానవుడు పుట్టినప్పటినుండి గిట్టేదాక ఒక మంచి పద్దతిలో జీవించడానికి తాను ఏర్పరుచుకున్న నీతినియమాలే ఈ ఆశ్రమ ధర్మాలు. ఇవి భారతీయ సాహిత్యంలో కోకొల్లలు. ఈ ధర్మాలను పాటిస్తే మానవ జీవితం సుఖమయం.

**ఆశ్రమ ధర్మాలు :-**

మానవ మనుగడకు అనాది కాలంనుండి అనేక మంది ఋషులు, మునులు, తమ జీవితాను భవాన్ని వడబోసి, అనుభవపూర్వకంగా కొన్ని జీవిత సత్యాలను తెలుసుకున్నారు. అవే ఆశ్రమ ధర్మాలని వీటిని పాటిస్తే మనిషి జీవితం సుఖమయమౌతుందని ఆ ధర్మాలు ఉపదేశిస్తూ వచ్చారు. పాటించిన వారు తమ జీవితకాలాన్ని సుఖసంతోషాలతో గడిపారు. పాటించని వారు అనేక కష్టాలనుభవించి, జీవితాన్ని దుఖమయం చేసుకున్నారు. ఈ ధర్మాలు తరతరాలుగా ఆచంద్రార్కం పాటించవలసినవి. కాని నేటికాలంలో ఈ ధర్మాలను గురించి పట్టించుకునేవారు అరుదయ్యారు. తత్కారణముగా సంసారంలో కలతలు, సమాజములో అసమానతలు, జీవితమే అగమ్యగోచరముగా మారి మనిషి మనీషిగా కాక మృగముగా మారుతున్నాడు. మనిషి మనీషిగా మారాలంటే ఈ ఆశ్రమధర్మాలు ఖచ్చితంగా పాటించ వలసినదే. అవి.

1. బ్రహ్మచర్యాశ్రమము.

2. గృహస్థాశ్రమము.

3. వానప్రస్థాశ్రమము.

4. సన్యాసాశ్రమము.

భారతీయసాహిత్యమే ఆశ్రమధర్మాలకు ఆలవాలమైంది. ఈ నాలుగు ఆశ్రమధర్మాలలో నాల్గవ ధర్మమైన సన్యాసాశ్రమము బ్రహ్మచర్యమునుండే స్వీకరింపవచ్చు. లేదా మూడు ఆశ్రమధర్మాలను పాటించిన తర్వాత సన్యాసము స్వీకరింపవచ్చు. వీటిలో మొదటిది అత్యంత ప్రధానమైనది, ఉత్కృష్టమైనది. మూడు ధర్మాలకు పునాది బ్రహ్మచర్యము. బ్రహ్మచారికి వేదాధ్యయనము, గురుశుశ్రూష, ఇంద్రియ నిగ్రహము, పెద్దలయందు గౌరవము ప్రధానధర్మములు. గృహస్తునకు ఏకపత్ని వ్రతము, తల్లిదండ్రులసేవ, అతిథిసత్కారము, ధర్మసంతానము, ఆచారనిర్వహణము, అనాథులయందు ఆదరణ, బీదలకు సహకారము ప్రధానములు. వానప్రస్తునకు ధర్మవ్యవహారబద్దుడై వయోభారాన్ని దృష్టిలో వుంచుకొని, కర్మలయందు స్వార్థమును వీడి సంతానమునకు వ్యవహారమప్పగించి, ధర్మపత్నితో కందమూలాదులనాహారివంచి తపమాచరించడము ధర్మము. ఈ మూడు ఆశ్రమాల తుదిప్రయోజనము మోక్షము. అదే సన్యాసాశ్రమము. వీటిని పాటించినపుడే మానవజీవితము ధన్యమౌతుంది.

**బ్రహ్మచర్యాశ్రమము:-**

బ్రహ్మచర్యమనగా కోరికలను అదుపులో వుంచుకొని లక్ష్యసిద్ధిని సాధించడము. అనగా లైంగిక వాంఛలకు మూలమైన కామోద్రేకాన్ని అదుపులో వుంచుకొని గురు శుశ్రూష చేసి లక్ష్యాన్ని చేరుకోవడమని చెప్పవచ్చును. ఈ క్రింది శ్లోకం బ్రహ్మచర్యం యొక్క విశిష్టతను తెలుపుతుంది.

" బ్రహ్మచర్యం ప్రపక్ష్యామి బ్రహ్మప్రాప్తి కరమ్ నృణామ్

ఆయురారోగ్యమైశ్వర్యం మనస్స్వాస్థ్యం శివాత్మకమ్ "

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :7.816(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:7(4), July: 2021
Online Copy of Article Publication Available: www.ijmer.in
Digital certificate of publication: http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 4th July
Publication Date:30th July 2021

DOI: http://ijmer.in.doi./2021/10.07.70

ఈ బ్రహ్మచర్యం మోక్షాన్ని కల్గిస్తుంది. ఆయుష్షును, ఆరోగ్యాన్ని, సంపదను, మనసు నిలకడను కలిగిస్తుంది. మంగళకరమైనది, శుభప్రదమైనది, శివమైనదని తాత్పర్యము.

మంగళకరమైనది కాబట్టి ఈ బ్రహ్మచర్యానికి భారతీయ సాహిత్యంలో అత్యంత ప్రాధాన్యత నిచ్చారు. ప్రస్తుతము నాలుగు ఆశ్రమధర్మాలలో బ్రహ్మచర్యాశ్రమధర్మమును గురించి మహాభారతములోని "కచదేవయాని కథ" లో చెప్పిన విధానాన్ని పరిశీలిద్దాము.

**కచదేవయాని కథ :-**

కచుడు దేవగురువు బృహస్పతి కుమారుడు. ఉత్తముడు, సౌశీల్యుడు, నియమనిష్టాగరిష్టుడు. బ్రహ్మచర్యాశ్రమధర్మాన్ని వినయవిధేయాలతో, ఏకాగ్రతతో పాటించేవాడు. రాక్షసగురువు శుక్రాచార్యుడు. ఇతడు దేవదానవ యుద్ధములో మరణించే రాక్షసులను బ్రతికించటానికి మృతసంజీవని విద్య సృష్టించు కొన్నాడు. శుక్రాచార్యుడు తన మృతసంజీవని విద్యతో మరణించే దానవులను పునర్జీవితులను చేస్తుండేవాడు. దేవతలలో మరణించేవారిని బ్రతికించేవారులేక బృహస్పతితో సహా వారు బయపడుచుండిరి. అపుడు దేవతలలో ఒకరు శుక్రుని మృతసంజీవని విద్యను సంపాదించుకొనిరావలయునని ఆలోచించారు. కాని శుక్రుని శుశ్రూషచేసి మెప్పించువారెవరని ఆలోచించి, బృహస్పతి కుమారుడైన కచుని ఈ కార్యమునకు నియమించారు. కచుడు దేవయానితో స్నేహము చేసి, ఆమె మనసు చూరగొని, శుక్రుశుశ్రూష చేసి నతనిచే ననుగ్రహితుడై, శుక్రుశిష్యులచే మృతుడయ్యినను "మృతసంజీవని" చే బ్రతికి "మృతసంజీవని విద్య" ను పొందెను. ఇందులో కచుడు తన బ్రహ్మచర్యాశ్రమ దీక్షచే శుక్రాచార్యుల వారిని మెప్పించి లక్ష్యాన్ని నెరవేర్చుకున్నాడు.

ఈ కథలో కచుని బ్రహ్మచర్య దీక్ష ప్రతిసందర్భములో కనిపిస్తుంది. శుక్రాచార్యుని దగ్గరవున్న మృతసంజీవని విద్యను సాధించాలంటే దేవతలలో బ్రహ్మచర్యాశ్రమ ధర్మాన్ని చాలా శ్రద్ధగా పాటించే వారిలో కచుడే నియమనిష్ఠాగరిష్ఠుడని తెలిసి బృహస్పతి కచుని శుక్రుని దగ్గరకు పంపిస్తారు. కచుని బ్రహ్మచర్యము ఎంతగొప్పదో ఇక్కడ మనకు తెలుస్తుంది. కచుడు శుక్రాచార్యుని దగ్గరకు వచ్చినపుడు, కచుని సుకుమారత్వానికి, మృదుమధుర వినయ ప్రియవచనాలకు, నియమవ్రత శీలానికి శుక్రాచార్యుడు ఎంతో సంతోషించి కచున్ని తన శిష్యునిగా స్వీకరిస్తాడు. అనతి కాలంలోనే కచుడు శుక్రునికి ప్రియశిష్యునిగా  మారుతాడు. కచుని గురుశుశ్రూష అటువంటిది.

కచుని గురుభక్తి భావన రాక్షసశిష్యులకు నచ్చక దేవతలమీద వున్న కోపముతో ఒకనాడు గోవులను తీసుకెళ్ళిన కచుని చంపుతారు. సాయంత్రానికి కచుడు రాకపోవడాన్ని దేవయాని తండ్రితో

" వాడి మయూఖముల్ గలుగువాడపరాంబుధి గ్రుంకె ధేనువుల్

నేడిట వచ్చె నేకతమ నిష్ఠమెయిన్ భవదగ్ని హోత్రముల్

పోడిగా వేల్వగ బడియె బ్రొద్దును బోయె గచుండు నేనియున్

రాడు వనంబులోన మృగరాక్షస పన్నగ బాధనొందెనో"

కచుని ప్రవర్తన ఎంత నచ్చితే దేవయాని తనతండ్రితో అతనిగురించి చెప్పడమే గాక కచుని చూడనిదే  ఆహారం ముట్టనని చెబుతుంది. ఇది కచుడు దేవయాని మనసును చూరగొన్న విధానము. శుక్రుడు దివ్య దృష్టితో చూసి రాక్షసులు చేసిన కృత్యానికి వగచి కచుని తన మృతసంజీవనితో బ్రతికిస్తాడు.

రెండవసారి కచుడు గురుయానతితో పూజకు పువ్వులు తేవడానికి వెళ్ళాడు. ఈ సారి రాక్షసులు తమ గురువు కచుని బ్రతికించకుండా వుండడానికి అతనిని చంపి, కాల్చి బూడిద చేసి ఆ బూడిదను  సురలో కలిపి శుక్రునిచేత తాగించారు. మళ్ళి కచుడు కనిపించక దేవయాని తండ్రితో విలపించగా నేను బ్రతికించినా మళ్ళీ అతనిని రాక్షసులు చంపుతారు. పుట్టినవారు మరణించక తప్పదు నీవు బాధ పడవద్దు అన్నాడు. అపుడు దేవయాని ...

" మతిలోకోత్తరుడైన యంగిరసు మన్మాండాశ్రితుండా బృహ

స్పతికిం బుత్రుడు మీకు శిష్యుడు సురూప బ్రహ్మచర్యాశ్రమ

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :7.816(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:7(4), July: 2021
Online Copy of Article Publication Available: www.ijmer.in
Digital certificate of publication: http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 4th July
Publication Date:30th July 2021
Cover Page
DOI: http://ijmer.in.doi./2021/10.07.70

వ్రత సంపన్నుడకారణంబ దనుజ వ్యాపాదితుండైన న

చ్యుత ధర్మజ్ఞ మహాత్మ యక్కచుని కే శోకింపకెట్లుండుదున్"

ఇక్కడ దేవయాని శుక్రునితో కచుడు ఉత్తముడైన అంగిరసుని మనుమడు, బృహస్పతి కుమారుడు , మీకు ప్రియ శిష్యుడు. అదీ గాక "బ్రహ్మచర్యాశ్రమ వ్రత" సంపన్నుడు, ఏకారణము లేక రాక్షసులచే చంపబడ్డాడు. అట్టి కచునికై బాధపడకుండా ఎలావుంటాను అంటుంది. అపుడు శుక్రాచార్యుడు దివ్యదృష్టితో కచుడు తన ఉదరములో వుండుటను తెలుసుకొని కచుని ఉదరములోనే బ్రతికించి, మృతసంజీవనిని బోధించి తన ఉదరము చీల్చుకుని వచ్చి తనను బ్రతికించమనెను. కచుడట్లే చేసెను.

ఈ విధముగా కచుడు తనబ్రహ్మచర్య దీక్షతో మృతసంజీవనిని సంపాదించెను. కావున బ్రహ్మచర్యము తరువాత మూడు ధర్మాలకు పునాదియని చెప్పవచ్చును. అందుకే ఈ ధర్మాలను మనము ఆయా వయసుల వారీగా పాటిస్తే .ఈ జీవితములో వచ్చు కష్టాలను అధిగమించవచ్చును.

" ఆశ్రమధర్మాలను పాటిద్దాం - ఆనందమయ జీవితాన్ని గడుపుదాం"

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీమదాంధ్రమహాభారతం - గీతా ప్రెస్ - గోరఖ్‌పూర్.

2. ఆంధ్రమహాభారతం అమృతత్వ సాధనం - ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం.